RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | మంగళవారం 2-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 246 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## మళ్లీ బాంబుల వాన



ఇరాన్ రాడార్, డ్రోన్ వ్యవస్థలపై అమెరికా దాడి

కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడి

మిగతా 2లో



## తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి..

- హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం..
- క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!
- హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'
- తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారన్న పొన్నం
- హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..

- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!
- సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం
- రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్
- టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్

2లో



## కడుపుతో ఉన్న భార్య కోసం ఖాకీలతోని కొట్లాట..

నడిరోడ్డుపై కూర్చున్న సామాన్యుడు! వీడియో వైరల్..

బెంగళూరులో నడిరోడ్డుపై గర్భిణీ భర్త ధర్నా

గవర్నర్ కాన్వాయ్ కోసం 30 నిమిషాలు ట్రాఫిక్ నిలిపివేతపై ఆగ్రహం

## ఏపీ శాంతిభద్రతలను దెబ్బతీసేందుకు కుట్ర



- శాంతిభద్రతలను దెబ్బతీయడమే లక్ష్యం: లోకేష్
- రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాల ఆరోపణ
- ఆర్థిక లావాదేవీలపై సంచలన వ్యాఖ్యలు
- కుట్రలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్న మంత్రి

2లో

## పంటలు కొనకపోతే
# కేంద్రంతో యుద్ధమే

**మద్దతు ధర ప్రకటించడమే కాదు, వాటిని కొనుగోలు చేయాలి**



- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ స్పందించట్లే...
- నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష కోసం నేను ఎవరినీ లెక్క చేయను
- రెండో విడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
- గుడిసెలు లేని ఆదిలాబాద్‌ను చేస్తాం.. ప్రాణహిత కట్టి తీరుతాం
- ఆసిఫాబాద్ జిల్లా ప్రజాపాలన-పగతి బాట

మంచిర్యాల: జూన్ 15 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లు, మొక్కజొన్నలు, పొద్దుతిరుగుడు పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో 67 లక్షల క్వింటాళ్ల వడ్లను సేకరించామని, ఇంకా 15 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని, వాటన్నింటినీ సేకరిస్తామని, మొత్తం 75 లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటామన్నారు. సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి పంచాయతీ కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను రేవంత్ ప్రారంభించారు. మొదటి విడతలో పూర్తయిన లక్ష ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. రెబ్బెన మండలం కొండపల్లి శివారు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సోమవారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక సభలో మాట్లాడారు.



## టీడీపీ, వైసీపీ బోత్ ఆర్ నాట్ సేమ్!

'చంద్రబాబు మోసానికి రెండేళ్లు' పేరుతో ప్రత్యేక సమావేశం

గొడ్డలి పార్టీ అంటూ కొత్త డ్రామా మొదలెట్టారు

చంద్రబాబు పాలిట వైఎస్ జగన్ గొడ్డలి, త్రిశూలం కూడా

చంద్రబాబు చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మాస్టర్

2లో



## ముప్పు వాటిల్లనివ్వం

- మా గడ్డపై భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగనివ్వం
- ప్రధాని మోదీకి మయన్మార్ అధ్యక్షుడు యూమిన్ ఆంగ్ హామీ
- ఢిల్లీలో ఇరునేతల ద్వైపాక్షిక చర్చలు

## జనసేన సభకు అనుమతి నిరాకరణ..

హైదరాబాద్‌లో జనసేన సభకు పోలీసుల అనుమతి నిరాకరణ

శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని డీసీపీ వెల్లడి

ఏపీ నేతల వ్యాఖ్యలతో రాష్ట్రంలో ఉద్రిక్తతలు ఉన్నాయని స్పష్టీకరణ

పార్కింగ్ సదుపాయం లేకపోవడం కూడా ఒక కారణమని వెల్లడి



## కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- వైసీపీని ఏకిపారేసిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి



కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు. ఁత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# జనసేన సభకు అనుమతి నిరాకరణ..

జనసేన అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శేరిలింగంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సమావేశం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడం లేదని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్యలు, పార్కింగ్ సదుపాయం లేకపోవడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. డీసీపీ మీడియాతో మాట్లాడుతూ.. జనసేన ప్రధాన కార్యదర్శి తమను కలిసి సభకు అనుమతి కోరారని తెలిపారు. ఈ సమావేశానికి సుమారు 2,000 మంది కార్యకర్తలు వస్తారని దరఖాస్తులో పేర్కొన్నారని చెప్పారు. అయితే, ఇటీవల ఏపీ నేతలు చేసిన కొన్ని వ్యాఖ్యల కారణంగా తెలంగాణలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని తెలిపారు. ముఖ్యంగా ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై ఆంధ్రప్రదేశ్‌లో కేసులు నమోదు కావడంతో ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చెలరేగే ప్రమాదం ఉందని అన్నారు. దీంతో పాటు, సభకు వచ్చే రెండు వేల మందికి సరిపడా పార్కింగ్ సౌకర్యం లేదని కూడా తెలిపారు. జనసేన నేతలు పార్కింగ్ కోసం ఎఫ్‌సీఐకి చెందిన భూమిని ఉపయోగించుకోవాలని భావించినా, ఆ భూమిపై కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించామని... ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో సభకు అనుమతి నిరాకరించినట్లు డీసీపీ స్పష్టం చేశారు.

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..

రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. (సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## కడుపుతో ఉన్న భార్య కోసం ఖాకీలతోని కొట్లాట..

వీఐపీ భద్రత పేరుతో సామాన్య ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం, ఇబ్బందులపై కర్ణాటక రాజధాని బెంగళూరులో మరోసారి ప్రజాగ్రహం పెల్లుబిక్కింది. గవర్నర్ కాన్వాయ్ వెళ్లేందుకు వీలుగా పోలీసులు పాత విమానాశ్రయం (ఓల్డ్ ఎయిర్‌పోర్ట్) రోడ్డుపై సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడంతో భారీ గందరగోళం చెలరేగింది. ఈ ఊపిరాడని ట్రాఫిక్ జామ్‌లో అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్తున్న ఓ గర్భిణీ స్త్రీ, ఆమె భర్త చిక్కుకుపోయారు. పోలీసుల తీరుతో సహనం కోల్పోయిన ఆమె భర్త.. నిరసనగా నడిరోడ్డుపైనే బైఠాయించి ధర్నాకు దిగాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పాత విమానాశ్రయ రహదారిలో ప్రస్తుతం అండర్‌పాస్ నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఈ రోడ్డు ఇప్పటికే ఇరుకుగా మారి, వాహనదారులు రోజూ నరకం చూస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం గవర్నర్ కాన్వాయ్ ఆ దారి గుండా వెళు ుండటంతో సమస్య మరింత జటిలమైంది. మధ్యాహ్నం సుమారు 12:13 గంటల ప్రాంతంలో ఫూతీఝయఝుశ్రీజూతీఱఅఎవ అనే ఖాతా నుంచి ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ అయింది. "ఈరోజు, గవర్నర్ గారి రాకపోకల కారణంగా, సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది" అంటూ సదరు నెటిజన్ ఆ వీడియోను పంచుకున్నారు.

# మళ్లీ బాంబుల వాన

దుబాయ్/వాషింగ్టన్: ఓవైపు పశ్చిమాసియాలో శాశ్వత శాంతిస్థాపనకు దౌత్యమార్గంలో చర్చలు జరుగుతుంటే మరోవైపు ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పశ్చిమాసియాలో బాంబులమోత మోగించాయి. గత వారం తమ అత్యాధునిక ఎంక్యూ--1 డ్రోన్‌ను ఇరాన్ క్షిపణులు కూల్చేసినందుకు ప్రతీకారంగా సోమవారం ఇరాన్‌కు చెందిన రాడార్ వ్యవస్థలపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. డ్రోన్లను ప్రయోగించే ప్రయోగకేంద్రాలనూ అమెరికా లక్ష్యంగా చేసుకుంది. అమెరికా దాడులకు ఇరాన్ ప్రతిదాడులతో ప్రతీకారంతీర్చుకుంది. అమెరికా వైమానిక స్థావరాలకు నిలయమైన కువైట్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. డ్రోన్లతో తెగబడింది. వీటిలో దాదాపు అన్నింటినీ కూల్చేశామని కువైట్ పేర్కొంది. "అంతర్జాతీయ జలాలపై నిఘా, పర్యవేక్షణ విధుల్లో ఉన్న తమ యూఎస్ ఎంక్యూ--1 డ్రోన్‌ను ఇరాన్ జలసమాధి చేసింది. అందుకే వాళ్ల రాడార్‌లను మేం నాశనంచేశాం. డ్రోన్ లాంఛింగ్ సైట్లను బూడిదచేశాం. గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్, హార్మూజ్ జలసంధి గుండా మా రక్షణలో వెళ్తున్న వాణిజ్య నౌకలపై దాడికి బయల్దేరినా డ్రోన్లనూ నేలకూల్చాం. ప్రతిగా ఇరాన్ మొదలెట్టిన దాడుల్లో మా బలగాలకు, మా సైనిక సంపత్తికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు"అని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ సోమవారం ప్రకటించింది. ఆదివారం గెరూక్, ఖేష్మ్ ద్వీపం మీదా దాడులు చేశామని అమెరికా మిలటరీ పేర్కొంది. అయితే టెలికమ్యూనికేషన్ టవర్ మీద సైతం అమెరికా దాడిచేసిందని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. దౌత్యం జరుపుతూ దాడులు చేయడంపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేల్ అసంతృప్తి వ్యక్తంచేశారు. "మొదట్నుంచీ అమెరికా మమ్మల్ని నమ్మట్లేదు. చర్చలు సైతం అపనమ్మకంతో కొనసాగుతున్నాయి.

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

ుచంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తూయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు. జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి..

హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

## ఏపీ శాంతిభద్రతలను దెబ్బతీసేందుకు కుట్ర

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (జూ) వ్యవహరిస్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు , ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా వైసీపీ నాయకత్వం అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రజల్లో అలజడి రేపడానికి, ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెడగొట్టడానికి ఆ పార్టీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తుంటే, దానిని అడ్డుకునేందుకు ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకత్వం అనుసరిస్తున్న తీరుపై మంత్రి లోకేష్ తీవ్రమైన రాజకీయ విమర్శలు చేశారు.

# టీడీపీ, వైసీపీ బోత్ ఆర్ నాట్ సేమ్!

తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేంద్ర కార్యాలయంలో 'చంద్రబాబు మోసానికి రెండేళ్లు' పేరుతో నేడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో మహిళలకు ఇచ్చిన హామీల అమలు, మహానాడులో చేసిన ప్రకటనలు, ప్రభుత్వ పనితీరుపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, మాజీ మహిళా మంత్రులు, మాజీ మేయర్లు, మాజీ మహిళా ఎమ్మెల్యేలు, మహిళా ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. సజ్జల రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ అంటూ సీఎం చంద్రబాబు కొత్త డ్రామా మొదలెట్టారని మండిపడ్డారు. చంద్రబాబు పాలిట వైఎస్ జగన్ గొడ్డలి, త్రిశూలం కూడా అని పేర్కొన్నారు. చంద్రబాబు చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మాస్టర్ అని విమర్శించారు. హామీలకు ఎగనామం, ప్రజలకు పంగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. మొన్న జరిగింది మహానాడు కాదు, లోగ్రేడ్ మహానాడు అన్నారు. టీడీపీకి, వైసీపీకి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. చంద్రబాబు-పవన్ కళ్యాణ్ బోత్ ఆర్ నాట్ సేమ్ అని.. టీడీపీ, వైసీపీ బోత్ ఆర్ నాట్ సేమ్ అని సజ్జల చెప్పుకొచ్చారు.

# ముప్పు వాటిల్లనివ్వం

న్యూఢిల్లీ: తమ భూభాగాలను భారత వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాగా మారనివ్వబోమని మయన్మార్ అధ్యక్షుడు యూమిన్ ఆంగ్ హ్లేయింగ్ పునరుద్ఘాటించారు. ఐదురోజుల భారత పర్యటన నిమిత్తం యూమిన్ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. మయన్మార్ పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచి అధ్యక్షపీఠాన్ని అధిరోహించిన రెండు నెలలకే ఆయన భారత్‌లో పర్యటనకు రావడం విశేషం. "భారత భద్రతా ప్రయోజనాలకు విఘాతం కల్గించే కార్యకలాపాలకు మయన్మార్‌ను నెలవు కానివ్వం. పొరుగుదేశంతో మిత్రత్వం మాకు ముఖ్యం"అని భారత ప్రధాని మోదీతో భేటీలో హ్లేయింగ్ స్పష్టంచేశారు. మోదీ, హ్లేయింగ్‌లో ద్వైపాక్షిక సమావేశం వివరాలను తర్వాత భారత విదేశాంగ శాక కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో పంచుకున్నారు. "ఏళ్ల తరబడి జుండా సైనికపాలన తర్వాత మయన్మార్‌లో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హ్లేయింగ్ మోదీతో వాణిజ్యం మొదలు రక్షణ, సరిహద్దు భద్రత, అభివృద్ధిలో తోడ్పాటు, ఇంధనం, పెట్టుబడులు, వైద్యం, విద్య, కృత్రిమమేధ వంటి సంక్లిష్ట సాంకేతికతలో పరస్పర సహకారంపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మయన్మార్ సార్వభౌమత్వం, అంతర్గత సమగ్రతకు భారత్ కట్టుబడిఉంది. మయన్మార్‌లో నెలకొంటున్న శాంతియుత వాతావరణంపైనా మోదీ ఆరాతీశారు"అని మిస్రీ తెలిపారు. "1,640 కిలోమీటర్ల మేర సరిహద్దు పంచుకుంటూ మయన్మార్ భారత్‌కు వ్యూహాత్మకమైన పొరుగుదేశంగా కొనసాగుతోంది.

# పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధమే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై రేవంత్ విరుచుకుపడ్డారు. కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషీ పంజాబ్, హరియాణాకు ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. జూన్ 15లోపు ధాన్యం సేకరణ పూర్తవుతుందని, అన్ని పంటలను మద్దతు ధరతో కొనాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఆఫీసు ముందు ధాన్యాన్ని పోస్తామని హెచ్చరించారు. కేంద్రంతో యుద్ధమే ప్రకటిస్తామన్నారు. తెలంగాణ రైతుల పక్షాన పోరాటం చేసి మీ సంగతి తేలుస్తామని హెచ్చరించారు. కిషన్‌రెడ్డి తెలంగాణలో తిరగడానికి సమస్య అవుతుందన్నారు. సత్రంలో పెట్టే ఉచిత భోజనానికి నెల్లూరి పెద్దారెడ్డి సిఫారసు తీరుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కేంద్రం కొనుగోలు చేసేలా ఆయన బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు భూ సేకరణకు 1500 ఎకరాలు కోసం చర్చిద్దామని లేఖ రాస్తే కిషన్‌రెడ్డి నుంచి ఇప్పటికీ స్పందన లేదన్నారు. బస్సుయాత్ర పేరుతో బీజేపీ నాయకులు రైతుల వద్దకు వెళ్లడం కాదని దుయ్యబట్టారు. నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల



రైతాంగం హక్కులు, సమస్యలే ముఖ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారి కోసం ఎవరినీ లెక్కచేయని స్పష్టం చేశారు. ఏదైనా నేను మొదట పరిష్కారం చేసుకోవాలని చూస్తానని, అలా కాకపోతే పంచాయతీ పెట్టుకోవడానికి సిద్ధమేనని హెచ్చరించారు. తెలంగాణ అంటే ఎందుకు అంత చిన్నచూపని ప్రశ్నించారు. మహారాష్ట్ర సీఎంను ఒప్పించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించకపోగా, మీ ఆలోచన ఏంటని ప్రశ్నించారు. ప్రాణహితపై బరాజ్ కట్టి ఎల్లంపల్లి గ్రావిటీతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల రైతాంగానికి లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తీరుతామని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన ప్రాణహిత--చేవెళ్లను విడిచిపెట్టి, కాళేశ్వరం కడితే కూళేశ్వరంగా మారిందన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ అంతర్రాష్ట్ర నదీ జలాలు పరిష్కారం చేసుకోవాలని చెబుతున్నారని, అయితే మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సహకరించడం లేదన్నారు. ఏడు మండలాలను ఏపీలో కలిపి లక్షలాది మందికి అన్యాయం చేశారని చెప్పారు. తాము మనుషులు, ఊళ్లను అడగం లేదని, కేవలం భూమి అడుగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మొదటి విడత 4.50 లక్షల ఇళ్లకు అదనంగా గూడేలకు 21వేలు అదనంగా ఇచ్చాం. లక్ష ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తున్నాం. ఇంకా ఇళ్లు రాని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రెండో విడతలో అందరికీ ఇళ్లు వచ్చేలా 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 15 నాటికి మరో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గతంలో ఇల్లు వచ్చిన వారికి భాగస్వామ్యం చేసి అందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. పేదవారి ఆత్మగౌరవాన్ని పెంచే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి తీరుతామన్నారు.



## ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు పార్కులే వేదిక

**అమీన్పూర్--పటాన్చెరు పరిధిలో 24 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు**

**కొల్లూరు, హుడా కాలనీల్లో రూ.1.40 కోట్ల పనులకు శంకుస్థాపన**

**గుమ్మడిదల (రామచంద్రాపురం), జూన్ 1( నేటి ప్రస్థానం):** అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 24 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేసినట్లు పటాన్చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజలకు మెరుగైన వినోద, ఆరోగ్య సదుపాయాలు అందించేందుకు ప్రతి పార్కును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం తెల్లాపూర్ విభాగ పరిధిలోని కొల్లూరు ద్విగృహ నివాస సముదాయం రెండో దశ కాలనీ పార్కు, హుడా కాలనీ పార్కు--2 అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. రూ.1.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో పార్కుల ఏర్పాటు ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. పార్కులు పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా స్వచ్ఛమైన వాతావరణంలో నడక, వ్యాయామం, విశ్రాంతికి అనుకూల పరిస్థితులు కల్పిస్తాయని చెప్పారు. పార్కుల అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు లభించడంతో పాటు ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు పార్కులను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, పటాన్చెరు సర్కిల్ ఉప కమిషనర్ జ్యోతి రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ సురేష్, తెల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాములు గౌడ్, ఉప ఇంజనీర్ కృష్ణవేణి, పట్టణాభివృద్ధి విభాగం మేనేజర్ విక్రమ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# పేదల ఇంటి స్థలాలపై కబ్జా నీడ.. పట్టా భూములపై రియల్ ఎస్టేట్ కన్ను!

## కిష్టయ్యపల్లిలో 91 పట్టాదారుల ఆందోళన

## భూములను కాపాడేందుకు పోరాడతాం: కౌన్సిలర్ ఇంద్రసేన

**జిన్నారం(గడ్డపోతారం) జూన్ 1 (నేటి ప్రస్థానం):** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల అంశం వివాదాస్పదంగా మారింది. గ్రామంలోని సర్వే నంబర్ 42లో గతంలో ప్రభుత్వం 91 మంది పేద కుటుంబాలకు కేటాయించిన ఇంటి స్థలాలపై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారనే ఆరోపణలు వెలువడటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం చట్టబద్ధంగా కేటాయించిన భూములను రక్షించాలని, ఎలాంటి ఆక్రమణలు జరగకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పట్టాదారులు కోరుతున్నారు. కొందరు వ్యక్తులు భూములను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొందని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న 15వ వార్డు కౌన్సిలర్ ఇంద్రసేన బాధిత పట్టాదారులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పేదల కోసం కేటాయించిన ఇంటి స్థలాలు ఎట్టి పరిస్థితుల్లోనూ



కబ్జాకు గురికాకుండా కాపాడుతామని స్పష్టం చేశారు. అవసరమైతే సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పేదల హక్కులను పరిరక్షించడం తమ బాధ్యత అని పేర్కొన్న ఇంద్రసేన, లబ్ధిదారుల భూములను రక్షించేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మరోవైపు, ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


# పేదల ఇంటి స్థలాలపై కబ్జా నీడ.. పట్టా భూములపై రియల్ ఎస్టేట్ కన్ను!







## కిష్టయ్యపల్లిలో 91 పట్టాదారుల ఆందోళన

## భూములను కాపాడేందుకు పోరాడతాం: కౌన్సిలర్ ఇంద్రసేన

**జిన్నారం(గడ్డపోతారం) జూన్ 1 (నేటి ప్రస్థానం):** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల అంశం వివాదాస్పదంగా మారింది. గ్రామంలోని సర్వే నంబర్ 42లో గతంలో ప్రభుత్వం 91 మంది పేద కుటుంబాలకు కేటాయించిన ఇంటి స్థలాలపై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారనే ఆరోపణలు వెలువడటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం చట్టబద్ధంగా కేటాయించిన భూములను రక్షించాలని, ఎలాంటి ఆక్రమణలు జరగకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పట్టాదారులు కోరుతున్నారు. కొందరు వ్యక్తులు భూములను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొందని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న 15వ వార్డు కౌన్సిలర్ ఇంద్రసేన బాధిత పట్టాదారులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పేదల కోసం కేటాయించిన ఇంటి స్థలాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాకు గురికాకుండా కాపాడుతామని స్పష్టం చేశారు. అవసరమైతే సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పేదల హక్కులను పరిరక్షించడం తమ బాధ్యత అని పేర్కొన్న ఇంద్రసేన, లబ్ధిదారుల భూములను రక్షించేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మరోవైపు, ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


# అమీన్పూర్‌కు నేరుగా రహదారికి మార్గం సుగమం

## నాలాపై వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు

## దశాబ్దాల ప్రజల డిమాండ్ నెరవేరనుంది –మెదక్ ఎంపీ రఘునందన్ రావు

గుమ్మడిదల (అమీన్పూర్), జూన్ 1( నేటి ప్రస్థానం): జాతీయ రహదారిపై లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్పూర్ వరకు నేరుగా రాకపోకల సౌకర్యం కల్పించాలన్న స్థానిక ప్రజల చిరకాల ఆకాంక్ష త్వరలో నెరవేరనుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. సోమవారం లింగంపల్లి చౌరస్తా వద్ద నాలా అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా సంబంధిత





ప్రాజెక్టు పురోగతిపై వివరాలు వెల్లడించారు. గత ఏడాది చివర్లో లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్పూర్ మీదుగా సుల్తాన్‌పూర్‌లోని బయటి వలయ రహదారి నిష్క్రమణ ప్రాంతం వరకు అనుసంధాన రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కన్నన్‌తో కలిసి స్థల పరిశీలన నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. చిన్న వాగు ఆక్రమణల కారణంగా నాలాగా మారిందని, ఆక్రమణలను తొలగించి వాగుపై వంతెన నిర్మించడం ద్వారా అమీన్పూర్‌కు జాతీయ రహదారి నుంచి నేరుగా రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అలాగే భేల్ చౌరస్తా నుంచి బయటి వలయ రహదారి వరకు నేరుగా అనుసంధానమయ్యే మార్గం ఏర్పాటే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించి, ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను వంద రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరగా, అధికారులు సానుకూలంగా స్పందించి కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. ఫలితంగా వాగుపై వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అమీన్పూర్, సుల్తాన్‌పూర్, బొల్లారం ప్రాంతాల ప్రజలతో పాటు శేరిలింగంపల్లి వాసులకు కూడా బయటి వలయ రహదారిపై ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, అభివృద్ధి పనుల ద్వారా ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని రఘునందన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, దిశ కమిటీ సభ్యుడు కాసాల సుధాకర్, పార్టీ నాయకులు ఎడ్ల రమేష్, రాచమల్ల సంతోష్ గౌడ్, వివిధ కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నర్సింగరావుకు ఆటో కార్మికుల ఘన సన్మానం

**మేడ్చల్, జూన్ 1(నేటి ప్రస్థానం):-** మేడ్చల్ అంబేద్కర్ ఆటో స్టాండ్ ఆటో యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో నర్సింగరావును ఘనంగా సన్మానించారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటో డ్రైవర్లు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎర్ర విజయరావు మాట్లాడుతూ, నర్సింగరావు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల ఆదరణ పొందుతున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఆదివాసు రాజేష్, నరేష్, ముదిరాజ్, కొమ్మురాజు, షఫీ భాయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొని నర్సింగరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు నిర్వహించారు. ఆటో కార్మికుల ఐక్యతను ప్రతిబింబించేలా జరిగిన ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది. పాల్గొన్న వారంతా నర్సింగరావు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# మైసిరెడ్డిపల్లిలో భూవివాదం

## కారంపొడి చల్లి, కర్రలతో దారుణ దాడి

## పాతకక్షలతో రెచ్చిపోయిన దాయాదులు

## మహిళలపై సైతం దాడి, వీడియో వైరల్

## నలుగురిపై కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు

**మేడ్చల్,(నేటి ప్రస్థానం) :** భూవివాదం, పాతకక్షల నేపథ్యంలో దాయాదులు దేవదానం మరియు మంజుల మాజీ సర్పంచ్ కరుణాకర్ ప్రదీప్ ఆ నలుగురు కలిసి జార్జ్, సంతోషి, మధుకర్ ల పైన కారంపొడి చల్లుకుంటూ, కర్రలతో దారుణంగా దాడి చేశారు ఘోర కలియుగ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లిగారి సంతోషకు సర్వే నంబర్ 114లో ఒక ఎకరం మూడు గుంటల వ్యవసాయ భూమి ఉంది. వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో పొలాన్ని చదును చేసుకునేందుకు గత నెల 29 వ తేదీ సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో సంతోష, ఆమె భర్త జార్జ్, కుమారుడు మధుకర్‌తో కలిసి వెళ్లారు.

**కళ్లల్లో కారం కొట్టి.. కిందపడేసి..:**

సంతోష, ఆమె భర్త జార్జ్, కుమారుడు మధుకర్ లు పొలంలో పనులు చేసుకుంటుండగా గ్రామానికి చెందిన దేవదానం, అతని భార్య మంజుల, కుమారులు కర్ణాకర్ (గ్రామ మాజీ సర్పంచ్) ప్రదీప్‌లు అక్కడికి చేరుకున్నారు. ఎందుకు వచ్చారని



ప్రశ్నించే లోపే, ముందస్తు ప్రణాళికతో తెచ్చుకున్న కారంపొడిని బాధితుల కళ్లల్లో చల్లారు. కళ్లు కనబడక ఇబ్బంది పడుతున్న సంతోష కుటుంబ సభ్యులపై కర్రలతో ఇష్టమొచ్చినట్లు విరుచుకుపడ్డారు. అంతటితో ఆగకుండా బూతులు తిడుతూ, మహిళలను సైతం జుట్టు పట్టుకుని కిందపడేసి విచక్షణారహితంగా తన్నారు. గత కొంతకాలంగా సాగుతున్న భూవివాదాన్ని మనసులో పెట్టుకునే ఈ దాడికి పాల్పడినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

**సోషల్ మీడియాలో వీడియో వైరల్ :** ఈ ఘర్షణకు సంబంధించిన దృశ్యాలను అక్కడున్న వారు మొబైల్‌లో చిత్రీకరించగా, సదరు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహిళ జుట్టు పట్టుకుని పొలంలో ఈడ్చుకుంటూ కొట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులని గవర్నమెంట్ ఆసుపత్రికి ట్రీట్మెంట్ అనంతరం పంపించారు.

**కేసు నమోదు.. దర్యాప్తు :** బాధిత మహిళ సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల ప్రకారం పోలీసులు అండర్ సెక్షన్ 118(1), 3(5) (భారతీయ న్యాయ సంహిత) కింద నిందితులపై సబ్-ఇన్‌స్పెక్టర్ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




## కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల పక్షానే

# సాయిపేట శ్రీనివాస్

### ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరాలి



**మేడ్చల్, జూన్ 1 (నేటి ప్రస్థానం):-** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ డివిజన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు గృహ నిర్మాణ అవకాశాలు కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు. పేదల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబం సురక్షితమైన గృహంలో నివసించేలా చర్యలు కొనసాగుతాయని సాయిపేట శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'

## అటవీ సంరక్షణే ధ్యేయం -- ప్లాస్టిక్ రహిత పార్కులే లక్ష్యం

## నారేపల్లి భాగ్యనగర్ నందనవనంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం ప్రారంభం

**మేడ్చల్, (నేటి ప్రస్థానం):** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12, 2026 వరకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అటవీ సంరక్షణ, వన్యప్రాణి పరిరక్షణ అవగాహన మరియు విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

**మొదటి రోజు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నిర్మూలన :** కార్యక్రమాల ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని అర్బన్ ఫారెస్ట్ పార్కులలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణం మరియు వన్యప్రాణులపై ప్లాస్టిక్ వల్ల కలిగే హానికరమైన ప్రభావాలపై సందర్శకులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. పార్కులను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. నారేపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని భాగ్యనగర్ నందనవనం పార్క్ వద్ద నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఎం. వేణు మాధవ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ప్రజల సహకారం ఎంతో అవసరం -- జిల్లా అటవీ అధికారి :**




ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి ఎం. వేణు మాధవ రావు మాట్లాడుతూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 43 అటవీ బ్లాకులలో విస్తరించి ఉన్న 8,360 హెక్టార్ల అటవీ విస్తీర్ణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. అర్బన్ ఫారెస్ట్ పార్కులను ప్లాస్టిక్ రహితంగా ఉంచడంలో ప్రజల సహకారం ఎంతో అవసరం. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సహజ వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ఈ ప్రణాళిక యొక్క ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.

**జూన్ 12 వరకు ముమ్మరంగా కార్యక్రమాలు :**

జూన్ 12 వరకు కొనసాగే ఈ 'ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు, అడవుల పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాలలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు, వన్యప్రాణుల రక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించే వినూత్న కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పర్యావరణం మరియు వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చురుకుగా ముందుకు వచ్చి, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అటవీ శాఖ అధికారులు పిలుపునిచ్చారు.

# నూతనకల్--కానుకుంట రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టాలి

### పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌కు కౌన్సిలర్ల వినతి



ఎల్లంపేట, జూన్ 1(నేటి ప్రస్థానం):- ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతనకల్ గ్రామం నుంచి కానుకుంట గ్రామానికి కలిపే పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో తరచూ వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ గాయపడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ 16వ వార్డు కౌన్సిలర్ సద్ది సురేష్ రెడ్డి, 21వ వార్డు కౌన్సిలర్ చిన్నోళ్ల భాస్కర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారి దుస్థితిని వివరించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రంపై స్పందించిన ఈఈ చంద్రశేఖర్, ఆమ్ ప్రాజెక్టు ద్వారా రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పనులను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యం: కూనంనేని

## మతపరమైన విభజనపై బీజేపీ నిలబడి ఉందన్న కూనంనేని

## తెలంగాణలో జైత్రయాత్ర చేయబోతున్నామని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా

## ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని సీపీఐ శ్రేణులకు పిలుపు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బీజేపీపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ మతపరమైన విభజన, మతం అనే సౌధంపై నిలబడి ఉందని తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే ఇక్కడ వారు కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం మాత్రం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందువల్ల సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల వ్యూహాన్ని ప్రకటిస్తూ, పొత్తులు ఉంటే కనీసం 5 స్థానాల్లో, లేనిపక్షంలో కనీసం 15 నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పార్టీ సన్నద్ధం కావాలని కూనంనేని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో బలమైన 40 నియోజకవర్గాలను గుర్తించామని, అక్కడ ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రత్యేక పాదయాత్రలు చేపడతామని వెల్లడించారు. ఈ యాత్రల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో పాటు స్థానిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా జూన్ 4న, ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై జూన్ 15న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, సెప్టెంబర్ 28న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

# పవన్ కల్యాణ్ తెలంగాణలో సభ పెట్టుకోవచ్చు: యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

- తెలంగాణలో పవన్ సభ పెట్టుకోవడంపై అభ్యంతరం లేదన్న యెన్నెం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పన్నెండేళ్లు పూర్తయిన తర్వాత కూడా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య బీఆర్ఎస్ పార్టీ కావాలనే వైషమ్యాలు రెచ్చగొడుతోందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణలో సభలు నిర్వహించుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా సభలు పెట్టుకునే హక్కు అందరికీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే సభల పేరుతో తెలంగాణను కించపరిచేలా మాట్లాడితే మాత్రం తాము చూస్తూ ఊరుకునేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/